



పందలూరు వద్ద వర్షానికి ధ్వంసమైన ఇల్లు

నీలగిరి జిల్లాలో వర్షబీభత్సం

● పాఠశాలలకు సెలవు ● అవలాంచిలో 292 మి.మీ. వర్ష పాతం

టి.నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం వేకువజామువరకు భారీ వర్షాలు కురిశాయి. అవలాంచిలో అధికంగా 292 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని నాలుగు తాలుకాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ జిల్లాలో గత కొద్ది రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో కుండపోతగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. దీనితో కుందా ఊటీ, గూడలూరు, పందలూరు తాలూకాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. వాతావరణ పరిశోధన కేంద్రం రెడ్అలర్ట్ జారీ చేసినప్పటికి ఓమోస్తరుగానే వర్షాలు కురవటంతో స్థానికులు, రైతులు ఊరట చెందారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకూ బొటానికల్‌గార్డెన్, రోస్ గార్డెన్, దొడ్డబెట్ట తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. కున్నూరులో వర్షం తగ్గుముఖం పట్టినా పెనుగాలులు వీచాయి. దీంతో వండిచోళై అళక్కరై రహదారిలో ఓ చెట్టు కూలిపడింది. అగ్నిమాపక సిబ్బంది వెళ్ళి చెట్టుకొమ్మలను నరికి, ఆ దారిలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. పందలూరు పరిసర ప్రాంతాల్లో పెనుగాలులతో వర్షాలు కురవటంతో మేబిలడు ప్రాంతంలో ఆసియా అనే వ్యక్తి ఇంటి వద్ద చెట్టు కూలి ఇంటి పైకప్పుపై పడింది. అగ్నిమాపక సిబ్బంది వెళ్లి ఆ చెట్టు తొలగించారు..ఈ పరిస్థితులలో నీలగిరి జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉండటంతో వాతావరణ పరిశోధక విభాగం అధికారులు ఆ జిల్లాకు సోమ, మంగళవారాలు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.దీంతో ఊటీ, కుందా, గూడలూరు,పందలూరు తాలూకాల్లోని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. సోమవారం ఉదయం ఎనిమిదిగంటల దాకా అధికపక్షంగా అవలాంచిలో 292మి.మీలు,అప్పర్‌భవానీ వద్ద 168మి.మీలు. పార్సన్స్ వ్యాలీ వద్ద 132మి.మీ.లు,పందలూరులో 130 మి.మీ.లు, ఊటీలో 16 మి.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

విద్యార్థుల అత్యుత్సాహం

● బస్సు పైకెక్కి సెల్ఫీ తీసుకుంటూ రగడ ● సిటీ బస్సులో గొడవ



బస్సు పైకెక్కిన విద్యార్థులు

పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొత్తగా తరగతుల్లోకి అడుగిడుతున్న విద్యార్థుల అత్యుత్సాహం సరికొత్త పుంతలు తొక్కుతోంది. మంచీచెడూ చూడకుండా ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఫుట్‌బోర్డులు, కిటికీలు పట్టుకుని ప్రయాణిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ బస్సుల్లో ఫుట్ బోర్డు ప్రయాణం వద్దని పోలీసులు పాఠశాలల్లో అవగాహన ప్రచారాలు చేపట్టినా, కొన్ని ప్రాంతాల్లో అలాంటి ఘటనలు చోటుచేసుకుంటూ ఉన్నాయి.సోమవారం ఉదయం ఎరుమైవెట్టిపాళయం నుంచి ప్యారీస్‌కు బయల్దేరిన నెం.57 హెచ్ ఎంటీసీ బస్సు వ్యాసర్పాడి ఫ్లై ఓవర్‌పై వస్తుండగా, కొందరు విద్యార్థులు బస్సు పైకెక్కి కేకలు వేస్తూ సెల్ఫీ తీసుకుంటూ రగడ సృష్టించారు. దీంతో, డ్రైవర్ బస్సును నిలిపివేయడం, అటుగా పోలీసులు రావడాన్ని గమనించిన విద్యార్థులు బస్సు నుంచి దూకి పరారయ్యారు.

సిటీ బస్సులో .. : రాజధాని నగరంలో సిటీ బస్సులో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా అల్లర్లకు పాల్పడిన 9మంది కళాశాల విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. వేసవి సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు సోమవారం ప్రారంభమయ్యాయి.ఈ నేపథ్యంలో నందనంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులు బ్రాడ్‌వే నుంచి గిండి వరకు నడిపిన 45వి సిటీ బస్సు ముందు బ్యానర్ కట్టి బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఇబ్బందికరంగా వ్యవహరించారు.దీనిపై అందిన సమాచారంతో రంగంలోకి దిగిన తేనాంపేట పోలీసులు ఆ బస్సు తేనాంపేట బస్టాండులో ఆగిన సమయంలో గొడవ చేసిన విద్యార్థులందరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అనంతరం ఐడీకార్డులను స్వాధీనంచేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని,రూట్ తల సంఘటనల్లో పాల్గొనే విద్యార్థులపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించిన పోలీసులు, కళాశాలల పునఃప్రారంభంరోజు కావడంతో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపివేశారు.





తంజావూరు సభలో కొత్త పథకాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

మారని గవర్నర్ తీరు

తంజావూరు సభలో సీఎం స్టాలిన్ ఆగ్రహం

పెండింగ్‌లో కలైంజర్ వర్సిటీ బిల్లు

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత కూడా గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యవహారశైలి మారలేదని, కలైంజర్ కరుణానిధి పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లును ఇంకా పెండింగ్‌లోనే ఉంచారని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తంజావూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ జిల్లాలో రూ.325.96 కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించి, రూ.309.48 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు. 2.25 లక్షలమంది లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. ఓ వైపు రాష్ట్ర ప్రజల బాగోగులు చూసుకుంటూ, వారికి పథకాలు అమలు చేసి పేరుతెచ్చుకుంటున్న డీఎంకే ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక అన్నాడీఎంకే నేత ఎడప్పాడి అదేపనిగా విమర్శలు చేస్తుండగా, మరో వైపు కేంద్ర ప్రభుత్వ ఏజెంట్‌లా గవర్నర్ వ్యవహరిస్తూ ప్రభుత్వ పథకాలకు అడ్డుకట్ట వేస్తున్నారని ఆరోపించారు. తంజావూరుకు, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి రాజకీయపరంగా, సాహిత్యపరంగా విడదీయలేని అనుబంధం ఉండేదని, ఆ కారణంగానే ఇక్కడ కలైంజర్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని శాసనసభలో బిల్లు ఆమోదించి పంపితే గవర్నర్ ఇప్పటివరకూ ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. తన సుదీర్ఘమైన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నానని, మీసా చట్టానికే తలవంచిన ఈ స్టాలిన్ ఎన్ని సవాళ్లు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనగలడన్నారు. ప్రాచీన కాలం ధాన్యం నూర్పిడికి ఎద్దుల బండ్లు చాలవని, ఏనుగులతో ధాన్యాన్ని నూర్పిడి చేసిన నగరంగా తంజావూరు కీర్తి చెందిందని, కనుకనే ఈ ప్రాంతాన్ని తమిళ ధాన్యాగారంగా పిలుస్తారని సీఎం పేర్కొన్నారు.

15నుంచి గృహిణుల నగదు పథకం దరఖాస్తుల స్వీకరణ...

ద్రావిడ తరహా డీఎంకే పాలనలో మహిళాభ్యుదయానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని, వాటిలో గృహిణుల ఖాతాలో ప్రతినెల రూ.1000ల జమచేసే కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. ఆ పథకం కింద రెండు విడతలుగా దరఖాస్తులు స్వీకరించి లక్షలాదిమంది గృహిణుల ఆర్థిక స్థోమత పెంచామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా లబ్ధిపొందని గృహిణుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు జూలై 15 నుండి 'ఉంగలుడన్ స్టాలిన్' (మీతో స్టాలిన్) పేరుతో రాష్ట్రమంతటా 10వేలకు పైగా ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో స్వీకరించే దరఖాస్తులపై 45 రోజుల్లోగా చర్యలు తీసుకుంటామని స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, శివశంకర్, కొవి చెళియన్, అన్బిల్ మహేష్, మెయ్యనాథన్, ఎంపీలు తిరుచ్చి శివా, కల్యాణసుందరం, మురసొలి సుధ, ఢిల్లీలోని ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్, ఎమ్మెల్యేలు దురై చంద్రశేఖరన్, అన్బళగన్, నీలమేఘం, అన్నాదురై, అశోక్‌కుమార్, కార్పొరేషన్ మేయర్లు సన్ రామనాథన్, శరవణన్, జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం తదితరులు పాల్గొన్నారు.

తంజావూరులో ఒకేచోట 24 గరుడ సేవలు

● పోటెత్తిన భక్తులు

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో సోమవారం ఒకేచోట జరిగిన 24 గరుడసేవలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివార్లను దర్శనం చేసుకున్నారు. హిందూ దేవాదాయ శాఖ, తంజావూరు రాజమహల్ దేవస్థానం, రామానుజ దర్శన సభల ఆధ్వర్యంలో 90వ సంవత్సర గరుడ వాహనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. తంజావూరులోని శ్రీనివాస పెరుమాళ్ ఆలయాల నుంచి 24 గరుడ వాహనాలతో ఊరేగించారు. ఈ ఊరేగింపులో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు కల్పించారు.



గరుడ వాహనాలపై స్వామివారిని దర్శించేందుకు పోటెత్తిన భక్తులు



తంజావూరులో మినీ బస్ సేవలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

రాష్ట్రవ్యాప్తంగా 3,103 మినీ బస్సులు

● జెండా ఊపి ప్రారంభించిన స్టాలిన్

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త మినీ బస్సుల విస్తరణ పథకం కింద మినీ బస్‌సేవలను ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. తంజావూరు చక్రవర్తి శరబోజి ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటైన కార్యక్రమంలో నగరాలు - గ్రామాలు, పట్టణాలు - కుగ్రామాల మధ్య బస్సులు నడవని ప్రాంతాల్లో 25 కిలోమీటర్ల వరకు నడిపే బస్ సేవలను పచ్చజెండా ఊపి ఆయన ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1009 రూట్లలో 3103 మినీ బస్సులను నడుపనున్నామని చెప్పారు. బస్సులు నడవని 25,708 కి.మీ.ల దూరానికి ఈ కొత్త మినీ బస్సులు నడుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎస్ఎస్ శివశంకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తంజావూరు మందుల షాపులో సీఎం ఆకస్మిక తనిఖీ

టి.నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్ళిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం రాత్రి అక్కడి 'ముదల్వర్ మరుందగం' (సీఎం మందులషాపు)లో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆ షాపులో ఉన్న స్టాకు వివరాలు, రోజుకు ఎంతమేర మందులు అమ్ముడవుతున్నాయనే వివరాలను షాపు సిబ్బంది వద్ద అడిగి తెలుసుకున్నారు.

● బాలుడి కిడ్నాప్ వ్యవహారం ..

ఎమ్మెల్యే జగన్‌మూర్తికి హైకోర్టు చివాట్లు



హైకోర్టు విచారణకు హాజరవుతున్న పురట్చిభారతం నేత, ఎమ్మెల్యే పూవై జగన్ మూర్తి

● ఏడీజీపీ జయరామ్ అరెస్టుకు ఆదేశం



ఏడీజీపీ జయరామ్

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపంలో బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో నిందితుడిగా ఉన్న పురట్చిభారతం పార్టీకి చెందిన కేవీ కుప్పం ఎమ్మెల్యే పూవై జగన్‌మూర్తి తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కిడ్నాప్ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకుగాను జగన్‌మూర్తి హైకోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఉదయం ఆ పిటిషన్‌పై న్యాయమూర్తి వేల్‌మురుగన్ విచారణ జరిపారు. బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో జగన్‌మూర్తికి, ఏడీజీపీ జయరామ్‌కు సంబంధాలున్నాయని ప్రభుత్వ తరపు వాదనలు విన్న న్యాయమూర్తి వారిద్దరూ మధ్యాహ్నం 2.30 గంటలకు హాజరుకావాలని ఆదేశించి, తదుపరి విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మళ్లీ విచారణ ప్రారంభమైనప్పుడు పూవై జగన్‌మూర్తి తన న్యాయవాదులతో కలిసి న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. అదే సమయంలో ఏడీజీపీ జయరామ్ కూడా విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మూర్తిపై న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏ ఊరి ఎమ్మెల్యే మీరు, ఎన్ని ఓట్లతో గెలిచారంటూ ప్రశ్నించారు. అందుకు జగన్‌మూర్తి తాను కేవీ కుప్పం శాసనసభ్యుడినని, 70వేల పైచిలుకు ఓట్లతో గెలిచానని బదులిచ్చారు. 'తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతోనే 70 వేల మంది ఎన్నుకుంటే వారి సమస్యలు పట్టించుకోకుండా కట్ట పంచాయితీలు చేస్తారా?' అంటూ న్యాయమూర్తి మండిపడ్డారు. "ఇద్దరు ప్రేమించి వివాహం చేసుకోవడం మీ పార్టీ వ్యవహరమా? మీరు సాధారణ వ్యక్తికాదు, ప్రజా ప్రతినిధి, నియోజకవర్గం అంతటికీ మీరే ఎమ్మెల్యే, అలాంటి మీరే పోలీసు విచారణకు సహకరించకపోతే సామాన్యులు ఎలా సహకరిస్తారు" అని నిలదీశారు. ఇకపై మందీ మార్బలంతో కోర్టుకు రావద్దని, విచారణకు ఒంటరిగా హాజరు కావాలంటూ.. తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేశారు. ఆ తర్వాత న్యాయమూర్తి వేల్‌మురుగన్ తన ఎదుట హాజరైై ఏడీజీపి జయరామ్‌తో బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో అరెస్టయిన వ్యక్తుల వాంగ్మూలం ప్రకారం ఆయనకు సంబంధం ఉందని తెలియటంతో అరెస్టుకు ఆదేశాలిస్తున్నట్లు తెలిపారు. వెంటనే ఏడీజీపీ తరపు న్యాయవాది అరెస్టు నుంచి మినహాయింపునివ్వాలని అభ్యర్థించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. ఎమ్మెల్యేని, ఏడీజీపీని సమంగా భావించకూడదని, ఓటేసిన ప్రజలకు గౌరవమిచ్చేలా విచారణకు సహకరించాలని పూవై జగన్‌మూర్తిని ఆదేశించానని, అయితే ప్రభుత్వ అధికారికి ఈ మినహాయింపు లేదని, తప్పులు చేసే అధికారులకు ఈ అరెస్టు ఒక గుణపాఠం చెబుతుందని కటువుగా వ్యాఖ్యానించారు.

ఇంతకీ ఏం జరిగింది?... : తిరువళ్లూరు కలాంబాక్కం ప్రాంతానికి చెందిన యువకుడు, తేని ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువతిని కిడ్నాప్ చేసేందుకు ఆమె తల్లిదండ్రులు కిరాయి ముఠాను ఏర్పాటు చేశారు. ఆ ముఠా ఆ జంట నివసిస్తున్న ఇంటికి వెళ్ళి, ప్రేమికుడి తమ్ముణ్ని (17) కిడ్నాప్ చేశారు. ఆ కిడ్నాప్ సంఘటనకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో కేవీకుప్పం ఎమ్మెల్యే పూవై జగన్‌మూర్తికి సంబంధాలున్నట్లు తెలియడంతో తిరువళ్లూరు ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్దకు వెళ్ళారు. పోలీసులను పసిగట్టిన జగన్‌మూర్తి ఇంటి నుండి పారిపోయారు. ఆ తర్వాత జగన్‌మూర్తి కిడ్నాప్ కేసులో అరెస్టయ్యే అవకాశాలు ఉండటంతో బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



జస్టిస్ కె.సురేందర్ చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్

హైకోర్టు న్యాయమూర్తిగా సురేందర్ ప్రమాణస్వీకారం

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా హైకోర్టు నుండి బదిలీపై వచ్చిన న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ఆయన చేత సోమవారం ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ స్వాగతోపన్యాసం చేస్తూ జస్టిస్ కె. సురేందర్ 2022లో తెలంగాణ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నప్పుడు 22,622 కేసులను సమర్థవంతంగా పరిష్కరించారని తెలిపారు. న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు జస్టిస్ కె.సురేందర్ తిలక్‌నగర్ బాంబుపేలుడు కేసు సహా బాంబుపేలుడు కేసులను, సత్యం కంప్యూటర్స్ కేసులో ప్రభుత్వ న్యాయవాదిగా సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలు న్యాయవాదుల సంఘాల ప్రతినిధులు పాల్గొని జస్టిస్ కె.సురేందర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.సురేందర్ ధన్యవాదాలు తెలుపుతూ రాజ్యాంగ ధర్మాసనానికి, న్యాయశాఖకు విశేష సేవలు అందించిన మద్రాసు హైకోర్టులో మరిన్ని విషయాలను నేర్చుకునే ఆసక్తితో వచ్చానని సభికుల హర్షధ్వానాల నడుమ పేర్కొన్నారు.ఇదిలా వుండగా జస్టిస్ కె.సురేందర్ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 59కి పెరిగింది.ఇంకా 16 మంది న్యాయమూర్తులను నియమించాల్సి ఉంది.

సమాచార ధ్వని

అభయారణ్యాల పేర్లు మార్పు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు అభయారణ్యాల పేర్లు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలో రెవెన్యూ పాలన సరిహద్దుల ఆధారంగా, కొత్త అటవీ అభయారణ్యాలు ఏర్పాటుచేశారు. అందుకు సంబంధించిన జీవో జనవరి 27వ తేది విడుదలైంది. అందులో ఉన్న అభయారణ్యాల్లో స్వల్ప సవరణలు చేసి అటవీ శాఖ జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, తెన్‌కాశి పేరుతో ఉన్న ఫారెస్ట్ రేంజ్ కుట్రాలంగా పేరు మార్చారు. అలాగే, తెన్‌కాశి ఫారెస్ట్ రేంజ్‌లో ఉన్న పులియాంగుడి, ఇకపై పులియాంగుడి కమ్యూనిటీ రిజర్వ్ ఫారెస్ట్‌గా పిలుస్తారు. చెన్నై పళ్లికరనై ఫారెస్ట్, పళ్లికరనై స్పెషల్ ఫారెస్ట్ రేంజ్ మార్చుతూ అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి సుప్రియా సాహు జీవో విడుదల చేశారు.

రుతుపవనాల ముందస్తు చర్యలకు సిబ్బంది

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలంలో 13 వార్డులున్నాయి. వాటిలో గిండి, వేళచ్చేరి, అడయార్, కోట్టూరుపురం, సైదాపేట తదితర ప్రాంతాలు రుతుపవన వర్షాలతో ముంపునకు గురవుతుంటాయి. ముంపులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు, ముందస్తు చర్యలు చేపట్టేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని జీసీసీ నిర్ణయించింది. ఆ ప్రకారం, ఈ నెల 15 నుంచి డిసెంబరు 12వ తేది వరకు 200 రోజులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన 12 మందిని నియమించింది.

రూ.80 కోట్లతో వళ్లువర్‌కోట్టం పునరుద్ధరణ

● 21న ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలో రూ.80 కోట్లతో పునరుద్ధరించిన వళ్లువర్ కోట్టం ఈ నెల 21న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. తమిళ మహాకవి తిరువళ్లువర్‌కు ఘనత చేకూర్చే విధంగా నుంగంబాక్కంలో సుమారు ఐదెకరాల్లో అద్భుత కళానైపుణ్యంతో నిర్మించిన వళ్లువర్‌కోట్టంను 1976వ సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి ప్రారంభించారు. 48 ఏళ్ళు పూర్తిచేసుకున్న దీని పునరుద్ధరణకు రాష్ట్రప్రభుత్వం రూ.80 కోట్లు కేటాయించింది. సుమారు 275 మంది ఇంజనీర్లు, కార్మికులతో పునర్నిర్మాణ పనులను ప్రజాపనులశాఖ పూర్తిచేసింది. వచ్చే శనివారం ముఖ్యమంత్రి స్టాలిన్ పునరుద్ధరించిన వళ్లువర్‌కోట్టంను ప్రారంభిస్తారని సచివాలయం సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

కుట్రాలం జలపాతాల్లో నీటి ఉధృతి

● స్నానాల నిషేధం

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పడమటి పర్వత కనుమల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకూ కురిసిన భారీ వర్షాల కారణంగా కుట్రాలంలోని ఐందరువి, ప్రధాన జలపాతంలో నీటి ఉధృతి అధికమైంది. ముందు జాగ్రత్త చర్యలుగా సోమవారం పర్యాటకులు స్నానం చేయకుండా నిషేధించడంతో వారు నిరాశ చెందారు. కుట్రాలం జలపాతాల వద్ద నీటి ధారలు ఉధృతంగా పడుతుండటంతో పర్యాటకులను స్నానానికి అనుమతిలేదంటూ పర్యాటకశాఖ తరుపున ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు. మరోవైపు ఎవరూ స్నానం చేయకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు. ఇదిలావుండగా, కుట్రాలం నుంచి కేరళ రాష్ట్రానికి వెళ్ళే మార్గంలోవున్న అచ్చన్‌కోవిల్ మనలార్ జలపాతంలో నీటి ఉధృతి తగ్గినందువల్ల అక్కడ పర్యాటకులను స్నానాలకు అనుమతించారు.

మదురై రౌడీ హత్యకేసు విరుదునగర్ కోర్టుకు బదిలీ



భారీ బంగారు హారంతో కోర్టుకు హాజరైన వరిచ్చియూర్ సెల్వం

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మదురైలో పేరుమోసిన రౌడీషీటర్ వరిచ్చియూర్ సెల్వంపై నమోదైన హత్యకేసు విచారణ విరుదునగర్ కోర్టుకు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విరుదునగర్ అల్లంపట్టికి చెందిన సెంథిల్‌కుమార్ 2021లో హత్యకు గురికావడంతో 2023 జూన్‌లో వరిచ్చియూర్ సెల్వం సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లా కోర్టులో జరిగిన ఈ కేసు విచారణను శ్రీవిల్లిపుత్తూరులోవున్న సెసెన్స్ కోర్టుకు బదిలీ చేస్తూ న్యాయమూర్తి అయ్యప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం ఈ కేసు విచారణకు రాగా, రౌడీ వరిచ్చియూర్ సెల్వం అతడి అనుచరులు కృష్ణకుమార్, ఈశ్వరసాయి తేజు, సతీష్‌కుమార్, లోకేశ్, సహాయ్ పెన్నీస్ చరణ్‌బాబు, బాలసుబ్రమణ్యంలను పోలీసులు అదుపులోకి తీసుకుని శ్రీవిల్లిపుత్తూరు కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం ఈ హత్యకేసును విరుదునగర్‌లోవున్న అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ న్యాయమూర్తి జయకుమార్ ఆదేశించి, తదుపరి విచారణ జరగనున్న జూలై 14న ఏడుగురు ముద్దాయిలను హాజరుపరచాల్సిందిగా పోలీసులకు ఉత్తర్వులు జారీచేశారు.

ఓపీఎస్ ఎమ్మెల్యే పదవి గురించి ఫిర్యాదు రాలేదు

● స్పీకర్ అప్పావు

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) శాసనసభ సభ్యత్వాన్ని రద్దుకు సంబంధించి అన్నాడీఎంకే విప్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అసెంబ్లీ స్పీకర్ అప్పావు పేర్కొన్నారు. తిరునల్వేలి జిల్లా రాధాపురం నియోజకవర్గ రైతుల కోరిక మేరకు కోదైఆరు సాగు పథకం కింద రాధాపురం కాలువనుంచి సోమవారం స్పీకర్ అప్పావు సాగునీటిని విడుదల చేశారు. అనంతరం స్పీకర్ మీడి యాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు రాధాపురం మండలంలోని 10 గ్రామాల్లో సుమారు 17వేల ఎకరాల వ్యవసాయ భూములు సాగునీరందించేలా జలాలు విడుదల చేసినట్లు తెలిపారు. అన్నాడీఎంకే ఎన్నికల గుర్తుపై 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓపీఎస్ పోటీ చేసి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారని, ప్రస్తుతం ఆయన అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందువల్ల ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని కోరుతూ అన్నాడీఎంకే విప్ నుంచి తనకు ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని స్పీకర్ అప్పావు తెలిపారు.

తిరుమాతో మాజీ మంత్రి భేటీ

● రాష్ట్ర రాజకీయాల్లో మార్పులుండేనా?



తిరుమావళవన్‌తో మాట్లాడుతున్న మాజీమంత్రి వైగై సెల్వన్

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే కూటమిలో కలకలం కొనసాగుతున్న నేపథ్యంలో, డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్‌తో అన్నాడీఎంకే మాజీమంత్రి వైగై సెల్వన్ భేటీ కావడం రాష్ట్రరాజకీయాల్లో మార్పులు ఏర్పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డీఎంకే కూటమిలో కొనసాగుతున్న ఎండీఎంకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం, డీపీఐ తదితర పార్టీలు రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అధికసీట్లులో పోటీచేసేందుకు అవకాశం కల్పించాలని పట్టుబట్టి డీఎంకే అధిష్టానంపై వత్తిడి చేస్తున్నాయి. దీనిపై డీఎంకే సీనియర్లు పలువురు మాట్లాడుతూ, డీఎంకే కూటమినుంచి వైదొలిగే మిత్రపక్షాలు ఒక్క నియోజకవర్గంలో కూడా గెలిచే అవకాశం లేదని అందువల్ల, సీట్ల వ్యవహారం సజావుగానే ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి వైగై సెల్వన్ సోమవారం తిరుమావళవన్‌తో హఠాత్తుగా భేటీ అయ్యారు. బీజేపీ కూటమికి నాయకత్వం వహిస్తున్న అన్నాడీఎంకేకు చెందిన నేతలు అధికార కూటమిలోవున్న డీపీఐ హఠాత్తుగా సమావేశం కావడంపై రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రరాజకీయాల్లో మార్పులు రావడం తప్పనిసరి అని పలువురు భావిస్తున్నారు.

ఈపీఎస్ సీఎం కావాలని కోరుతూ మాజీ మంత్రి ధ్యానం



ధ్యానం చేస్తున్న రాజేంద్ర బాలాజీ

టి.నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మళ్ళీ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఆ పార్టీకి చెందిన రాజేంద్ర బాలాజీ ధ్యానం చేశారు. ఆదివారం విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరులో తానిప్పారై సర్వేశ్వరాలయానికి రాజేంద్రబాలాజీ వెళ్ళి దైవదర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత అర్ధరాత్రి సమయంలో పద్మాసనం వేసుకుని సుమారు అరగంటసేపు ధ్యానం చేశారు.

ఖాళీ టీచర్ పోస్టులు సత్వరం భర్తీచేయాలి

● టీటీవీ దినకరన్

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల పోస్టులు సత్వరం భర్తీచేయాలని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 20వేల సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభం కాకముందే ఈ పోస్టులు భర్తీ చేసి ఉంటే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ఖాళీ ఉపాధ్యాయుల పోస్టులు సత్వరం భర్తీచేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని టీటీవీ దినకరన్ డిమాండ్ చేశారు.

రాందాస్‌కు అదనపు పోలీసు భద్రత

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దిండివనం తైలాపురం తోటలో ఉంటున్న పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ ఇంటికిఅదనపు పోలీసు భద్రతఏర్పాటైంది. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి మధ్యనెలకొన్ని విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. అన్బుమణి మద్దతుదారులను రాష్ట్ర, జిల్లాస్థాయి పదవుల నుంచి రాందాస్ తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాందాస్ ఇంటికి ఇప్పటికే ఆరుగురు పోలీసులతో భద్రత కల్పించగా, తాజాగా మరో ఐదుగురు పోలీసులను నియమించారు.

ఇస్రో శాస్త్రవేత్త మృతి పట్ల సీఎం సంతాపం

అడయార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్‌లో ఫస్ట్‌గ్రేడ్ శాస్త్రవేత్తగా పనిచేసిన శాస్త్రవేత్త సు.ముత్తు (74) ఆదివారం మృతి చెందగా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం తెలిపారు. తిరునెల్వేలికి చెందిన ఆయన తిరువనంతపురంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని సోమవారం మదురైలోని ఆయన కుమార్తె నివాసానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. 1951 మే 10వ తేదీ జన్మించిన ముత్తు... శాస్త్రవేత్తగా రాణిస్తూనే 50కుపైగా నవలలను కూడా రాసారు. ఆయనకు ఉత్తమ నవలా రచయితగా కూడా రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అందజేసింది. మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంతో కలిసి పనిచేసిన ముత్తు.. తిరువనంతపురంలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి అనారోగ్యం బారినపడటంతో ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలిసిన ముఖ్యమంత్రి స్టాలిన్ తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతి వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

25న మాజీ మంత్రిపై హత్యాయత్నం కేసు తీర్పు

అడయార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సీవీ షణ్ముగంపై పీఎంకే కార్యకర్తలు చేసిన హత్యాయత్న కేసులో తుది తీర్పును ఈ నెల 25వ తేదీన విల్లుపురం కోర్టు వెలువరించనుంది. 2010లో విల్లుపురం జిల్లా దిండివనంలోని తన నివాసంలో ఉన్న మాజీ మంత్రి సీవీ షణ్ముగంపై పీఎంకేకు చెందిన కొందరు కార్యకర్తలు దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ కేసులో పీఎంకేకు చెందిన 15 మంది నిందితులుండగా, కేసు విచారణ గత ఏప్రిల్ నెల 28వ తేదీన పూర్తయింది. తుది తీర్పును సోమవారం వెలువరిస్తామని విల్లుపురం జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మహ్మద్ ఫరూక్ వెల్లడించారు. దీంతో ఈ కేసులో తుది తీర్పు సోమవారం వెలువరిస్తామని మొదట ప్రకటించి, మళ్ళీ ఈనెల 25వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

పదోన్నతిలో సామాజిక న్యాయం

● రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక విధానంలో చేపట్టనున్న మార్పుల కారణంగా భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ఓకమిటీని నియమించినట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో, ప్రభుత్వం ఉద్యోగుల పదోన్నతులను సీనియారిటీని అనుసరించి సామాజిక న్యాయప్రకారం ప్రకారం జరుగుతుంది. అయితే, ఈ విధానాన్ని మార్పు చేయాలని కోరతూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ప్రస్తుతం ఉన్న విధానంలో మార్పులుండాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించింది.అత్యున్నత న్యాయస్థానంఇచ్చి తీర్పుకారణంగా కొన్ని మార్పులు జరిగాయి. దీనివల్ల భవిష్యత్తులో కలిగే నష్టాలను పరిశీలించేందుకు, చట్టపరంగా సమస్యను పరిష్కరించేలా మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జీఎం అక్బర్ నేతృత్వంలో ఓ కమిటీని రాష్ట్రప్రభుత్వం నియమించింది. సచివాలయం కేంద్రంగా ఈ కమిటీ పనిచేస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో పేర్కొంది. ఈ కమిటీకి సహకరించేందుకు అధికారులు, ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా నియమించిన రాష్ట్రప్రభుత్వం ఈ కమిటీ రాబోయే మూడు నెలల్లోపు తన నివేదికను సమర్పిస్తుందని తెలిపింది.

ఘనంగా ఎన్‌సీసీఎఫ్ ప్రథమ వార్షికోత్సవం

● పేదలకు సహాయాల పంపిణీ



మహిళలకు చీరలు అందజేస్తున్న బిషప్ దేవదాస్ పాత్ర

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలోని సేఫ్ ఇండియా మిషనరీ డయాసిస్ (ఎస్ఐఎండీ) నిర్వహణలోని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫెలోషిప్ (ఎన్‌సీసీఎఫ్) ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఉదయం సౌత్ ఇండియా మెట్రో పాలిటన్ బిషప్ దేవదాస్ పాత్ర అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 50 మంది పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఎస్ఐఎండీ ప్రారంభించిన ఆంగ్లికన్ ఎపిస్కోపల్ చర్చి ప్రాంగణంలో బిషప్ దేవదాస్ పాత్ర కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్టినరోజు జరుపుకున్న రీనాకు శుభాకాంక్షలు తెలియజేసి, రెవ.జార్జ్‌ముల్లర్ రొడ్డాకు ఆర్డినేషన్ చేసి ధృవీకరణపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంచారజాతి కుటుంబాల్లోని పిల్లలకు అక్షరాలు నేర్పించాలన్న సంకల్పంతో స్థాపించిన ఎస్ఐఎండీ ఆధ్వర్యంలో గత 48ఏళ్లుగా సమాజానికి అంకితభావంతో సేవచేసే భాగ్యం కలిగించదని హర్షం వ్యక్తంచేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఎస్ఐఎండీ, ఎన్‌సీసీఎఫ్ నిర్వాహకులు, బిషప్ ఎం.పద్మారావు, బిషప్ రామ్‌చరణ్, రెవ.వి.జీవరత్నం తదితరులను ఘనంగా సన్మానించారు.

సమస్యలు పరిష్కారించాలని గోతిలో ధ్యానం



గోతిలో కూర్చుని ధ్యానం చేస్తున్న యోగా టీచర్ కాశీనాథదురై

టి.నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రామనాథపురంలో రాష్ట్ర యోగా టీచర్ల సమాఖ్య నాయకులు ఆందోళన జరిపారు. రాష్ట్రంలో 2వేల మంది శిక్షణ పొందిన యోగా టీచర్లు ఉన్నారు. వీరంతా రెండేళ్లుగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో జీతాలు లేకుండానే పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాలలోను విద్యార్థులకు యోగా నేర్పేందుకు యోగా టీచర్లను నియమించాలని కోరుతూ రామనాథపురంలోని యోగా టీచర్లు ఆందోళన చేపట్టారు. ఆ సందర్భంగా యోగా టీచర్ల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాశీనాథదురై ఓ గోయి తవ్వి అందులో పద్మాసనం వేసుకుని కూర్చుని, ఆపై గోతిపై కొయ్యపలక మూత పెట్టుకున్నారు. ఆందోళనలో పాల్గొన్న టీచర్లు ఆ పలకపై మట్టిని పోసారు. అరగంట సేపు ఆయన ధ్యానం చేసిన మీదట గోతిపై ఉన్న మూతను తీయగా, ఆయన బయటకు వచ్చారు.

టాస్మాక్ వ్యతిరేక ఉద్యమాన్ని నేరంగా పరిగణించలేం

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ దుకాణానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాన్ని నేరంగా పరిగణించలేమని తేల్చిచెప్పిన మద్రాస్ హైకోర్టు మక్కల్ అధికారం సంస్థపై నమోదు చేసిన కేసు రద్దు చేసింది. కడలూరు జిల్లాలోని చిదంబరం ఆలయ ప్రాంతంలో వున్న టాస్మాక్ మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరుతూ 2016 మే నెలలో మక్కల్ అధికారం సంస్థ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. పోలీసుల అనుమతిలేకుండా జరిపిన ఈ ఆందోళన కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని ఆ సంస్థకు చెందిన మురుగానందం, మణిమారన్ తదితర నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి చిదంబరం కోర్టులో ఛార్జిషీటు కూడా దాఖలు చేశారు. అయితే, ఈ కేసు రద్దుచేయాలని కోరుతూ మురుగానందం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. సోమవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి వేల్ మురుగన్ ఈ కేసుపై విచారణ జరుపగా, పిటిషన్ సహా ప్రభుత్వం తరుపు న్యాయవాదులు హాజరై వాదించారు. ఇరుతరుపు వాదనలు విన్న న్యాయమూర్తి నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాల వల్ల ప్రజలు, ప్రధానంగా మహిళలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రజల తరుపున నిర్వహించే ఆందోళన నేరంగా పరిగణించలేమని తేల్చిచెప్పారు. అధికారంలోవున్న రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సమయంలో టాస్మాక్ దుకాణాల సంఖ్యను తగ్గిస్తామన్న హామీతో ప్రజలను మభ్యపెడుతున్నారని అయితే, ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మూసివేసిన మద్యం దుకాణాలను మరో ప్రాంతాల్లో ప్రభుత్వమే ఏర్పాటు చేస్తోందని, ఈ పరిస్థితి మారితేనే పోరాటాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ప్రజల కోసం పోరాడిన మక్కల్ అధికారం సంస్థకు వ్యతిరేకంగా నమోదైన కేసును రద్దు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

చిట్లపాక్కం: చిట్లపాక్కం-భజన ఆలయ వీధి, మైగై వినాయక ఆలయ వీధి, నవీన్ స్టార్ హౌస్, కాసా గ్రాండ్, జెనిత్, శంకరాపురం, ఏడీబీ అవెన్యూ, ఎస్ఎస్‌కే వీధి

పల్లికరనై: కృష్ణా నగర్, రాజ్యలక్ష్మి నగర్, వల్లల్ పారి నగర్, జీవా నగర్, కన్నాభిరాన్ ఆలయ వీధి, తులుకాత్తమ్మన్ ఆలయ వీధి

మేడవాక్కం: అంబేద్కర్ రోడ్డు, మూవేందర్ రోడ్డు, సౌమ్య నగర్, గజేంద్ర నగర్ కొంత భాగం, వీరభద్రన్ నగర్, బాలాజి నగర్, జిగ్నా స్కూల్ ఏరియా, అంబత్తూర్ రియల్ ఎస్టేట్, అయ్యపాక్కం, ఆదిపేట 3వ మెయిన్ రోడ్డు, వానగరం రోడ్డు, ఎంటీహెచ్ రోడ్డు, డీపీ 67 నుంచి 94, పెరియార్ కాలని, ప్రిన్స్ అపార్ట్‌మెంట్స్, పీకేఎం రోడ్డు, కల్యాణి ఎస్టేట్, అలగిరెడ్డి అపార్ట్‌మెంట్స్, కుప్పం, శంకర్ షెల్లింగ్, నటేశన్ నగర్, 14వ వీధి, వల్లలార్ వీధి

పల్లావరం: పాతిమా నగర్, ముత్తుస్వామి నగర్, ఓంశక్తి నగర్, కన్నమ్మాళ్ నగర్

అనకాపుత్తూర్: జీఎన్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, పెద్ద వీధి, షణ్ముగముత్తలి వీధి, విజయలక్ష్మి వీధి, వినోబా నగర్, కుళకరై వీధి, మేట్టు వీధి, అనకాపుత్తూర్ మార్కెట్, తిరునీర్‌మల, భజన ఆలయ వీధి, మిల్లిమా వీధి, శివరాజ్ వీధి, ఓయిలియమ్మన్ ఆలయ వీధి, డాక్టర్స్ వీధి, మేట్టు వీధి, జగజ్జీవన్ రామ్ వీధి, సర్వీస్ రోడ్డు, గాంధీ వీధి

రాజ్ భవన్: డీపీ ఆలయం, గాంధీ రోడ్డు, కోకిలం వీధి, దండపాణి వీధి, కబాలి వీధి, ఆనందాలవన్ అవెన్యూ, సేవా నగర్, సోని నగర్, దండేశ్వరం కాలని, లక్ష్మీపురం, వీజీపీ అవెన్యూ

ఇంజంబాక్కం: వేట్టువాంకేని మొదటి అవెన్యూ, అక్కరై గ్రామం, అల్లికుళం, అంబేద్కర్ వీధి, అన్నా ఎన్‌క్లేవ్, బేతెల్ నగర్ (నార్త్, సౌత్), భక్తి వేదాంత స్వామి రోడ్డు, స్వామి రోడ్డు, భారతి అవెన్యూ, బృందావన్ నగర్, చోళమండలం కళాకారుల గ్రామం, చోళమండల దేవి నగర్, క్లాసిక్ ఎన్‌క్లేవ్, కాపర్ బీచ్ రోడ్డు, డా.నంజుండారో రోడ్డు, ఈసీఆర్ ఇంజంబాక్కం, ఇంజంబాక్కం కుప్పం, ఇంజంబాక్కం, వేట్టువాంకేని జంక్షన్ రోడ్డు, గంగైయమ్మన్ ఆలయ వీధి, కునల్ గార్డన్, హనుమాన్ కాలని, హరిశ్చంద్ర 1 నుంచి 4 వీధులు, కాకన్ వీధి, కలైంజర్ కరుణానిధి రోడ్డు, కర్పగ వినాయకర్ ఆలయం, కస్తూరిబాయ్ నగర్, ఎల్జీ అవెన్యూ, మరియక్కాయార్ నగర్, నైనార్‌కుప్పం (ఉద్దాండి), నీలాంగరై కుప్పం, ఓలీవ్ బీచ్, పల్లవన్ నగర్, పనయూర్‌కుప్పం, పనయూర్, ఎన్నారై లేఔట్, వీజీపీ లేఔట్, పెబుల్ బీచ్, పెరియార్ వీధి, పొద్దిగై వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, ప్రిస్టేట్ మరియు మంద్రి, రాజన్ నగర్ 1,2 వీధులు, రాజీవ్ అవెన్యూ, రామలింగం నగర్, రాయల్ ఎన్‌క్లేవ్, సీ క్లిప్, సీషెల్ అవెన్యూ, సీ షోర్ టౌన్, సెల్వ నగర్, షాలిమార్ గార్డన్, శేషాద్రి అవెన్యూ, స్పార్క్‌లింక్ సాండు అవెన్యూ, స్ప్రింగ్ గార్డన్ 1,2 వీధులు, టీవీఎస్ అవెన్యూ, టీచర్స్ కాలని, తిరువళ్లువర్ రోడ్డు, థోమస్ అవెన్యూ, వావూసీ వీధి, విమల గార్డన్, సుకు బీచ్

కోవూర్: మూకాంబిగై నగర్, కుంద్రత్తూర్ మెయిన్ రోడ్డు, రామ్ నగర్, కుమరన్ నగర్, పెరియ పనిచేరి, తండలం మెయిన్ రోడ్డు, బాబు గార్డన్, సిక్కరాయపురం, కొల్లంజేరి. **మొగప్పైర్:** శ్రీనివాస నగర్, భాగ్యత్తమ్మాళ్ నగర్, పెరియార్ నగర్, ఒలింపిక్ కాలని, అక్షయ కాలని, కామరాజర్ వీధి.

వానగరం: వానగరం రోడ్డు, స్కూల్ వెల్ఫేర్ రోడ్డు, వెల్లలార్ వీధి, మూడవ మెయిన్ రోడ్డు, ఎంటీహెచ్ రోడ్డు, టీపీ 67 నుంచి 94, 14వ వీధి, నక్కీరన్ వీధి, నాగేశ్వరరావు వీధి, కల్యాణి ఎస్టేట్, మునుస్వామి వీధి, శ్రీరామ్ ప్లాట్స్, ఆలకృతి ప్లాట్స్, కుప్పం, ఆచ్చి మసాలా వీధి, శంకర్ షెల్లింగ్, నటేశన్ నగర్, దేవి కురుమారియమ్మన్ నగర్, చిన్న, పెద్ద కాలనీ, ప్రిన్స్ అపార్ట్‌మెంట్, పీకేఎం రోడ్డు, బృందావన్ కాలని.

రాష్ట్రంలో 220 మందికి కోవిడ్ లక్షణాలు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 220 మంది సహా దేశవ్యాప్తంగా 7,274 మందికి కోవిడ్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటన విడుదల చేసింది. అదే సమయంలో, ప్రస్తుతం వ్యాప్తిస్తున్న కరోనా వైరస్ ప్రాణాంతకం కాదని, అందువల్ల ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. కానీ, ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించింది. గర్భిణులు, ఇతర వ్యాధులతో బాధపడే వారు బహిరంగ ప్రాంతాలకు వెళ్లిన సమయంలో మాస్క్ ధరించాలని ఆరోగ్య శాఖ తెలియజేసింది.

సీమాన్ దించింది కల్లా? తాటి చారా?

● తూత్తుకుడి ఎస్పీ విచారణ

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీమాన్ తాటి చెట్టు ఎక్కి కిందకు దించింది కల్లా? తాటి చారా? అనే విషయమై విచారిస్తున్నట్లు తూత్తుకుడి ఎస్పీ తెలిపారు. సీమాన్ దించింది కల్లు అని తేలితే ఆయనపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ ఆదివారం తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సమీపంలోని పెరియతాళైలో నిర్వహించిన కల్లుగీత ఆందోళనలో తాటి చెట్టు ఎక్కిన సీమాన్, కుండలో కల్లు దించిన విషయం తెలిసిందే.

రైళ్లు ఢీకొని ముగ్గురి మృతి

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన వేర్వేరు ఘటనల్లో రైళ్లు ఢీకొని ముగ్గురు మృతిచెందారు. ఆవడి సమీపంలోని ఇసుక బట్టీలో పనిచేస్తున్న అన్బు (60), వేల్‌మురుగన్ (42) ఆదివారం సాయంత్రం ఆవడి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతిచెందారు. రామేశ్వరం సమీపం తంగచ్చిమఠానికి చెందిన మరియకెల్లన్ (35) బీచ్ పార్క్ సమీపంలో పట్టాలు దాటుతుండగా, రామేశ్వరం నుంచి తాంబరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొని ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనలపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

3కు మాజీ మంత్రి కేసు వాయిదా

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సి.విజయభాస్కర్‌పై నమోదైన అక్రమార్జన కేసు విచారణ జూలై 3వ తేదీకి వాయిదాపడింది. పుదుకోట జిల్లా విరాలిమలై ఎమ్మెల్యే విజయభాస్కర్, గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారని రాష్ట్ర అవినీతి నిరోధక, విజిలెన్స్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసు పుదుకోట జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌లో సోమవారం విచారణకు రాగా, విజయభాస్కర్ హాజరుకాలేదు. కానీ, ఆయన తరఫున న్యాయవాది హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ జూలై 3వ తేదీకి వాయిదావేస్తూ న్యాయమూర్తి వి.వెంకటేశ్ పెరుమాళ్ ఉత్తర్వులు జారీచేశారు.

సముద్రంలో పడవ మునిగి జాలరి మృతి

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం నెల్లూరుకు కృత్రిమ పగడపు దిమ్మెలు తీసుకెళ్తున్న పడవ నీటమునిగిన ఘటనలో కడలూరు జాలరి మృతి చెందాడు. కడలూరు హార్బర్ నుంచి నెల్లూరుకు పగడపు దిమ్మెలు తీసుకెళ్లిన పడవ, అక్కడ దిమ్మెలు దింపిన అనంతరం తిరుగు ప్రయాణమైంది. పడవలో పగుళ్లు ఏర్పడడంతో అది నీట మునిగిపోతున్న సమయంలో చుట్టుపక్కల జాలర్లు పడవలోని ఆరుగురిని రక్షించగా, కడలూరుకు చెందిన మాణిక్యస్వామి మృతిచెందాడు. ఈ ఘటనపై మెరైన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆసనూరు పంటపొలాల్లో ఏనుగు సంచారం



ఆసనూరు వద్ద సంచరిస్తున్న ఏనుగు

టి.నగర్, జూన్ 16 : ఈరోడ్ జిల్లా ఆసనూరు పంటపొలాల్లో ఏనుగు సంచరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆసనూరు పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా వర్షాలు కురవటంతో అడవిలోని ఏనుగులు జనావాస ప్రాంతాల్లో సంచరించడం పెరిగింది. ఈ నేపథ్యంలో పాత ఆసనూరు వద్ద రాజకన్నా అనే రైతుకు చెందిన తోటలో ఏనుగు చొరబడి అక్కడి పంటలను, ట్రాక్టర్‌ను ధ్వంసం చేసింది. అక్కడున్న నీటి తొట్టిలో నీళ్లు తాగింది. ఇవన్నీ ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైంది. ఏనుగు సంచారం గురించి తెలుసుకున్న స్థానికులు వెళ్ళి టపాకాయలు పేల్చి దానిని తరిమికొట్టారు. ఈ విషయమై అక్కడి రైతులు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు జోక్యం చేసుకుని అడవి ఏనుగు బారి నుండి తమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ కార్యాలయంలో మొరాయించిన లిఫ్ట్



లిఫ్ట్‌లో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న దృశ్యం

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లిఫ్ట్ హఠాత్తుగా పనిచేయకపోవడంతో అందులో చిక్కుకున్న ఇద్దరు ఉద్యోగులు సురక్షితంగా బయటపడ్డారు. ఈరోడ్ కలెక్టర్ కార్యాలయంలోని పాత భవనంలో లిఫ్ట్ సౌకర్యం ఉంది. సోమవారం ఉదయం గిరిజన సంక్షేమ శాఖ అధికారి శాంతి, ఆమె అసిస్టెంట్ నాగరాజ్ లిఫ్ట్‌లో పై అంతస్తుకు వెళ్తుండగా మధ్యలో లిఫ్ట్ ఆగిపోయింది. వారు పెట్టిన కేకలకు కార్యాలయంలో ఉన్న పోలీసులు అక్కడకు చేరుకుని వెంటనే లిఫ్ట్ ఆపరేటర్‌ను పిలిపించి తోటి ఉద్యోగుల సాయంతో ఇద్దరిని లిఫ్ట్ నుంచి సురక్షితంగా రక్షించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కొడైకెనాల్ 'గుణా' గుహ వద్ద నోట్ల వర్షం కురిపించిన వానరం



చెట్టుపై నుంచి నోట్లను విసిరేస్తున్న వానరం

టి.నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్ 'గుణా' గుహ వద్ద చెట్టుపై కూర్చుని ఓ వానరం ఐదువందల కరెన్సీ నోట్ల కట్ట పట్టుకుని ఒక్కో నోటు విసిరేసిన సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది. కొద్ది రోజుల క్రితం గుణా గుహను సందర్శించేందుకు వచ్చిన కర్ణాటకకు చెందిన పర్యాటకుడి సంచిని ఓ వానరం లాక్కెళ్లింది. కాసేపయ్యాక ఆ వానరం ఓ చెట్టెక్కి సంచిలో ఉన్న రూ.500 నోట్ల కట్ట పట్టుకుని ఒక్కో నోటు కిందకు వేసింది. దీనితో ఆ కర్ణాటక పర్యాటకుడు కింద పడిన నోట్లను ఏరుకోగా తక్కిన ప్రయాణికులు కూడా నోట్లను సేకరించి ఆయనకు అందజేశారు. అయితే ఆ వానరం విసిరేసిన నోట్లలో కొన్ని గుణా గుహలో పడ్డాయి. ఆ నోట్లను తీయడం కష్టమని తెలుసుకుని, కర్ణాటక పర్యాటకుడు ఆ వానరం విసిరేసిన నోట్లన్నింటిని ఏరుకుని బయలుదేరాడు. ప్రస్తుతం ఆ వానరం చెట్టుపై నుంచి ఐదు వందల రూపాయల నోట్లను ఒక్కొక్కటిగా విసిరేస్తున్న వీడియోను చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.

కోలాహలంగా చేపలు పట్టే వేడుక



చేపలతో యువకులు

పెరంబూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపురి సమీపంలో సోమవారం నిర్వహించిన చేపలు పట్టే వేడుకలు కోలాహలంగా సాగాయి. జనుతిపట్టి చెరువులో రుతుపవన వర్షాలకు ముందు, సాగు పనులు పూర్తయిన నేపథ్యంలో, ప్రతి ఏడాది చేపలు పట్టే వేడుక నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో, ఈ ఏడాది చేపలు పట్టే వేడుకల్లో చుట్టుపక్కల నుంచి సుమారు 10 గ్రామాలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. ఉదయం గ్రామ పెద్ద జెండా ఊపిన వెంటనే పిల్లలు, యువకులు, పురుషులు చెరువులో దిగి చేపలు పట్టుకున్నారు. ఒక్కొక్కరు సుమారు 5 నుంచి 7 కిలోల వరకు చేపలు పట్టుకుని ఆనందంగా ఇళ్లకు తిరిగి వెళ్లారు.



కమల్‌కు వీఐటీ యాజమాన్యం అభినందనలు

పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభకు ఎంపికైన కమల్‌హాసన్‌ను వీఐటీ యూనివర్శిటీ యాజమాన్యం అభినందించింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్, ముగ్గురు డీఎంకే అభ్యర్థులు, ఇద్దరు అన్నాడీఎంకే అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో, నగరంలో కమల్ హాసన్ ఇంట్లో ఆయనకు కలుసుకున్న వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ జీవీ సెల్వం ఆయనకు శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

కమల్ హాసన్‌ను అభినందిస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ జీవీ సెల్వం



జంబూద్వీప ప్రకటన సంస్మరణ సందర్భంగా రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



తిరుచ్చిలోని ఆదిద్రావిడ పాఠశాలలో చదివి, జబల్‌పూర్‌లోని ధర్మశాస్త్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో లా కోర్సులో చేరనున్న విద్యార్థి డి.రాగిణిని సత్కరించి తన వద్దనున్న విలువైన కలాన్ని ఆమెకు కానుకగా అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

క్యారెక్టర్ ఆర్టిస్టుగా కదిర్ తండ్రి

చిత్రజ్యోతి

కోలీవుడ్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న యువ నటుడు కదిర్ తండ్రి లోగు కూడా సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'పడై తలైవన్', 'పేరన్బు' వంటి సినిమాల్లో మంచి పాత్రలను పోషించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించారు. ఆయన వైవిధ్యభరితమైన నటనాశైలి అభిమానులతో పాటు విశ్లేషకులు కూడా మెచ్చుకుంటూ, ప్రశంసిస్తున్నారు. విజయ్ 'మాస్టర్' చిత్రంలో విలన్ పాత్ర పోషించిన విజయ్ సేతుపతి పక్కన ఒక చిన్న పాత్ర ద్వారా వెండితెరకు పరిచయమైన లోగు ఆ తర్వాత 'సుళల్' అనే వెబ్ సిరీస్ నటించారు. అలాగే, అర్జున్, ఐశ్వర్య రాజేష్, విష్ణు విశాల్ చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ఆయనకు నటనపై అమితమైన మక్కువ ఉంది. తనకు లభించే చిన్న చిన్న పాత్రల్లో తన నటనతో మెప్పిస్తూ రాణిస్తున్నారు.



లోగు - కదిర్



అవన్నీ వదంతులే

- అనుష్కా శెట్టి -

యువ దర్శకుడు లోకేష్ కనకరాజ్ - హీరో కార్తి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఖైదీ-2' చిత్రంలో ప్రముఖ హీరోయిన్ అనుష్క శెట్టి నటించనున్నారంటూ కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. దీనిపై అనుష్క క్లారిటీ ఇచ్చారు. 'లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో కార్తి హీరోగా నటించే 'ఖైదీ-2' మూవీలో నటించేందుకు నన్ను ఎవరూ సంప్రదించలేదు. ఎవరో ఈ తరహా ప్రచారం చేశారు. అలాంటి సమాచారం ఏదైనా ఉంటే మీకందరికీ తెలియజేస్తాను. అనవసరంగా పుకార్లు సృష్టించవద్దు' అని పేర్కొన్నారు. కాగా, అనుష్క గతంలో హీరో కార్తితో 'అలెక్స్ పాండియన్' అనే చిత్రంలో నటించారు. దీంతో లోకేష్ కనకరాజ్ ప్రాజెక్టు కోసం అనుష్కను సంప్రదించగా, ఆమె కూడా సమ్మతించినట్టు వచ్చిన వార్తలను తోసిపుచ్చారు. ఇదిలావుంటే, అనుష్క శెట్టి చివరగా 'మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి' అనే చిత్రంలో నటించిన విషయం తెల్సిందే. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'ఘాటి' మూవీ విడుదలకు సిద్ధంగా ఉంది.

గోపీనాథ్ - ఐశ్వర్య జంటగా 'హమ్'

ఫస్ట్‌లైన్ ఉమాపతి నిర్మాణ సారథ్యంలో ఎస్.కృష్ణవేల్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'హమ్'. ఈ చిత్రం ద్వారా గోపీనాథ్, ఐశ్వర్య అనే యువ నటీనటులు హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. సీనియర్ దర్శక నటుడు, నిర్మాత కె.భాగ్యరాజ్, గేయ రచయిత వివేకా, దర్శకులు ఎల్.సురేష్, ఇస్మాయిల్, నిర్మాతలు రాజా తదితరులు హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఇందులో భాగ్యరాజ్ మాట్లాడుతూ, "హమ్' అని ఎలా చెప్పాలో కూడా నాకు తెలియదు. ఈ పదానికి అనేక రకాలైన మాడ్యులేషన్స్ ఉన్నాయి. టైటిల్ చాలాబాగుంది. సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. చిత్ర నిర్మాత ఉమాపతి ప్రసంగంలో అనేక విషయాలు ఇమిడివున్నాయి. చిత్రపరిశ్రమలోకి ఎవరు ఎపుడు వస్తారో తెలియదు. చిత్ర పరిశ్రమలో మీరు కలిసే వ్యక్తి మీకు గురువుతో సమానం. అతని నుంచి నేర్చుకోవడానికి అనేక విషయాలుంటాయి. అందుకే నేను ప్రతి ఒక్కరినీ తక్కువగా అంచనా వేయను. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక్క కొత్తకోణం ఉంటుంది. దర్శకుడు కృష్ణవేల్ ఎవరి వద్దా అసిస్టెంట్‌గా పనిచేయలేదని విన్నాను. ఇలాంటివారు కొందరు ఉంటారు. దీనికి కారణం వారి తెలివితేటలు. నిర్మాత ఉమాపతికి అనేక విషయాలపై పరిపక్వత, అపారజ్ఞానం ఉంది. ఆయన మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర బృందం సభ్యులు, సాంకేతిక నిపుణులు, దర్శక నిర్మాతలు తమ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

దర్శకుడిగా పార్తిబన్ కుమారుడు



పార్తిబన్ - రాకీ

సీనియర్ నటుడు, నిర్మాత, దర్శకుడు ఇలా అన్ని సినీ క్రాఫ్ట్‌ల్లో రాణిస్తున్న పార్తిబన్ కుమారుడు రాకీ సినీ దర్శకుడిగా అరంగేట్రం చేయనున్నారు. వివిధ ప్లాట్‌ఫాంలపై తన సత్తా చాటుతున్న రాకీ త్వరలోనే మెగాఫోన్ పట్టనున్నాడని పార్తిబన్ అధికారికంగా వెల్లడించారు. ఈ విషయంపై ఆయన ఓ ప్రకటన చేస్తూ, 'రాకీ నా కుమారుడు. దర్శకుడు విజయ్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఇపుడు ఒక కమర్షియల్ థ్రిల్లర్ మూవీ కోసం స్క్రిప్టు సిద్ధం చేశాడు. త్వరలోనే అధికారికంగా ప్రకటన వస్తుంది. ఆ మూవీలో నాకు కూడా ఓ అవకాశం ఇస్తానని మాట ఇచ్చాడు. జీవితాన్ని అతడు చూసే కోణం సూపర్. జీవితంలో అతడి విజయం నాకు ఓ చిరస్మరణీయ రోజుగా మిగిలిపోతుంది' అన్నారు.

అలర్ట్ - రెడ్ క్రాస్ సొసైటీల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

అడయార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రథమ చికిత్స, అవగాహన తదితర అంశాలపై అలర్ట్, రెడ్ క్రాస్ తమిళనాడు శాఖల మధ్య కీలక ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తమిళనాడు శాఖ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందులో అలెర్ట్ ఛైర్మన్ వీఎం మురళీధరన్, వ్యవస్థాపక ట్రస్టీ కళా బాలసుందరం, సహ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ రాజేష్ ఆర్ త్రివేది, ఐఆర్‌సీఎస్ టీఎన్ శాఖ వైస్ ప్రెసిడెంట్, ఛైర్మన్ జస్టిస్ ఎం.జయచంద్రన్, జనరల్ సెక్రటరీ వేదవ్యాస్‌లు హాజరయ్యారు.

సూర్యోదయం చూసేందుకు పోటెత్తిన పర్యాటకులు



పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారికి ఆదివారం పర్యాటకులు, భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా, త్రివేణి సంగమం ప్రాంతంలో సూర్యోదయం వీక్షించేందుకు వేకువజామున నుంచే పర్యాటకులు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆ సమయంలో కారు మబ్బులు లేకపోవడంతో సూర్యోదయం పర్యాటకులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసి ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు.

ఎస్‌కేపీసీలో ఫ్రెషర్స్‌కు గ్రాండ్ వెల్‌కమ్



జూనియర్లకు గులాబీలతో స్వాగతం పలుకుతున్న సీనియర్ విద్యార్థినిలు

● విద్యార్థినుల సందడి

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్వాల్‌బజార్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ)లో మొదటి సంవత్సరం విద్యార్థినులకు సీనియర్లు ఘనస్వాగతం పలుకుతూ సోమవారం 'ఫ్రెషర్స్‌డే' నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ నేతృత్వంలో జూనియర్లకు సీనియర్లు గులాబీలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థినులకు వాసవాంబ ఆశీస్సులను అందించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని కన్వెక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. బాలికల విద్యాభివృద్ధికి చేయూతనివ్వడంలో భాగంగా ఎస్‌కేపీడీ చారిటీస్, కళాశాల యాజమాన్యం ప్రతిష్టాత్మకమైన సిల్వర్ జూబ్లీ అక్షయ ఎండోమెంట్‌ను ఇద్దరు విద్యార్థినులకు మొత్తం ట్యూషన్ ఫీజు అందించారు. దీనిని గుగ్గిలం రమేష్, గౌతమ్, ఎస్‌కేపీసీ ఉద్యోగులు అందించినట్లు ఊటుకూరు శరత్‌కుమార్ తెలిపారు. అలాగే తమ కళాశాలలో నాలుగు మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ సీట్లు, ఐదుగురు మెరిట్ విద్యార్థినులకు ఫీజు రాయితీ, 20 మంది విద్యార్థినులకు ఫ్రెషర్స్‌డే సందర్భంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డా.పీబీ వనిత, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.భరణికుమారి, అధ్యాపకులు, ట్రస్టీలు పాల్గొన్నారు.

కుమరి తీరంలో అలల ఉధృతి

●పర్యాటకులు వెళ్లకుండా పోలీసు బందోబస్తు



పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రతీరానికి పర్యాటకులు వెళ్లరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కన్నియాకుమారి జిల్లాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో తిర్పరుపు జలపాతం సహా పర్యాటక ప్రాంతాల్లో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో, ప్రతిరోజు వేలాది మంది పర్యాటకులు వచ్చే కన్నియాకుమారి సముద్రతీరంలో గాలుల వేగం అధికంగా ఉండడంతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో, పర్యాటకులను సముద్రతీరానికి వెళ్లరాదని హెచ్చరించిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటుచేసి బందోబస్తు చేపట్టారు.

క్యూ ఆర్ కోడ్ ద్వారా బృహదీశ్వరాలయ వివరాలు



క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న పర్యాటకులు

పెరంబూర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వర ఆలయ ప్రవేశ ద్వారంలో దేవాదాయ శాఖ అధికారులు క్యూ ఆర్ కోడ్ పరిచయం చేశారు. ఈ కోడ్ స్కాన్ చేయడం ద్వారా బృహదీశ్వరాలయ కట్టడాల నైపుణ్యం, చరిత్ర, ఆలయంలోని శిల్పాలు సహా పలు అంశాలు పూర్తిగా ఇంగ్లీషులో పర్యాటకులు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.



చెన్నై, తండయార్‌పేట ఆసుపత్రిలో రూ.5.25 కోట్లతో నర్సుల హాస్టల్ భవనానికి భూమి పూజ చేస్తున్న మేయర్ ఆర్.ప్రియ, శాసనసభ్యుడు ఆర్డీ శేఖర్ తదితరులు





పచ్చయప్పన్ కళాశాల బ్యానర్‌కు పూలమాల వేస్తున్న విద్యార్థులు - క్వీన్‌మేరీస్ కళాశాలలో విద్యార్థినులకు సూచనలిస్తున్న అధ్యాపకురాలు

డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు మేళతాళాలతో ఘన స్వాగతం

● రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో సందడి

ప్యారీస్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులకు సీనియర్లు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు చాక్లెట్లు, గులాబీలు అందజేసి, తిలకం దిద్ది ఆహ్వానించారు. పలు కళాశాలల్లో ప్రార్థనా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సీనియర్ ప్రొఫెసర్లు, ఈ విద్యా సంవత్సరంలో ఎలా చదువుకోవాలి, అధ్యాపకులు, సహ విద్యార్థులతో ఎలా మెలగాలి అనే దానిపై సూచనలిచ్చారు. మెరీనా బీచ్ సమీపంలోని క్వీన్‌మేరీస్ మహిళా కళాశాలలో తొలిరోజు కళాశాలకు వచ్చిన విద్యార్థినుల్లో భయాన్ని పోగొట్టే విధంగా సీనియర్లు కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అమింజికరైలోని పచ్చయప్పన్ కళాశాల ప్రధాన ప్రవేశద్వారంలో ఎర్ర తివాచి పరచి, సన్నాయి మేళాలతో విద్యార్థులను ఆహ్వానించారు. కళాశాల ఫొటోతో ముద్రించిన క్యాలెండర్లను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పంపిణీ చేసి అల్పాహారాన్ని కూడా వడ్డించారు.

మరోవైపు రాయపేటలోని న్యూ కాలేజీలో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. రాయపురంలోని భారతి కళాశాల, పట్టాభిరామ్‌లోని హిందూ కాలేజ్, నుంగంబాక్కం లోని క్రిస్టియన్ ఉమెన్స్ కళాశాల, తాంబరం క్రిస్టియన్ కాలేజీ తదితర కళాశాల ప్రాంగణాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

శివగంగలో వీకేసీ స్టోర్



స్టోర్ ప్రారంభోత్సవ దృశ్యం

వాషర్‌మెన్‌పేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శివగంగలో వీకేసీ స్టోర్ ప్రారంభమైంది. వీకేసీ డైరెక్టర్లు అజీజ్, ఉపాధ్యక్షుడు ప్రేమ్ రాజ్ సోమవారం ఈ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రపంచ ఫ్యాషన్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని, దేశంలోని టూటైర్, త్రీటైర్ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి కూడా అధునాతన ఫ్యాషన్ అందుబాటులో వుంచుతున్నామన్నారు. ఈ స్టోర్లలో వీకేసీ ప్రైడ్, వీకేసీ డెబన్, గుడ్‌స్పాట్, ఈజీ, డెబాంగో వంటి కలెక్షన్లను కూడా పరిశీలించవచ్చని వివరించారు.



అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ముచ్చటిస్తున్న ఉప ముఖ్యమంత్రి

బలమైన భావితరాన్ని సృష్టించే బాధ్యత అంగన్వాడీలదే

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బలమైన రేపటి తరాన్ని సృష్టించే బాధ్యత అంగన్వాడీలదేనని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. ఈ విషయమై ఆయన తన ఎక్స్ పేజీలో... తేని జిల్లా వీరపాండిలో సాంఘిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిశు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం కింద పనిచేస్తున్న పిల్లల కేంద్రాన్ని సోమవారం పరిశీలించినట్టు తెలిపారు. ఈ కేంద్రంలో పిల్లల సంఖ్య, సిబ్బంది, ఉద్యోగుల హాజరు, తల్లుల వివరాలు, పిల్లలు, గర్భిణులకు అందించే ఆహారాన్ని పరిశీలించామని తెలిపారు. బలమైన రేపటి తరాన్ని సృష్టించే బాధ్యత అంగన్వాడీ కేంద్రాలకు ఉందని గ్రహించాలని అక్కడ అధికారులు, సిబ్బందికి సూచించినట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ట్వీట్ చేశారు.

మహాబలిపురంలో రాడిసన్ బ్లూ రిసార్ట్ టెంపుల్ బే పునఃప్రారంభం

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్ టెంపుల్ బే 2.0 పునఃప్రారంభమైంది. తీర ప్రాంత విలాసవంతమైన వ్యక్తుల కోసం దీనిని పునర్నిర్మించినట్టు నిర్వాహకులు ప్రకటించారు. విభిన్న రుచులతో కూడిన ఈ బే యువతను విశేషంగా ఆకట్టుకుంటోందన్నారు. జీఆర్టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విక్రమ్ కోట మాట్లాడుతూ.. వార్ఫ్ 2.0 పునఃప్రారంభించడం ద్వారా సముద్ర ఆహారాల ఉత్తమమైన విందును వినియోగదారులకు అందిస్తున్నట్లు వివరించారు.



నెల్లయప్పర్ ఆలయ రథానికి
సాయుధ బలగాల భద్రత

పెరంబూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నెల్లయప్పన్ ఆలయ రథానికి సాయుధ పోలీసు భద్రత ఏర్పాటైంది. తిరునల్వేలి టౌన్ నెల్లయప్పర్-గాంధీమతి అమ్మవారి ఆణి ఉత్సవాలు ప్రతి ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాలు ఈ నెల 30వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానుండగా, వేడుకల్లో ప్రధానమైన రథోత్సవం జూలై 8వ తేది జరుగనుంది. రథోత్సవం కోసం తూర్పు రథ వీధిలో ఉంచిన రథాలు బయటకు తీసి అలంకరిస్తున్నారు. అలాగే, చండీకేశ్వరుడుకి కొత్త రథం తయారీ ముగింపు దశకు చేరుకుంది. వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా రథాల వద్ద సాయుధ దళ పోలీసు భద్రత ఏర్పాటైంది.



సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీజీహెచ్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.52 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,815
తలనీలాలు సమర్పించినవారు: 35,007



నిండిన పిల్లూరు డ్యాం

● తీర ప్రాంత ప్రజలకు వరద హెచ్చరిక



చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం సమీపంలోని పిల్లూరు డ్యాం నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరుకోనుండటంతో భవానీ వాగు ప్రాంతాల్లో వరదలు వచ్చే అవకాశముందని జలవనరుల శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నీలగిరి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పిల్లూరు డ్యాంలోకి సెకనుకు 15వేల ఘనపుటడుగుల చొప్పున జలాలలు ప్రవేశిస్తున్నాయి. దీనితో ఆ డ్యామ్ నీటిమట్టం 97 అడుగులకు చేరింది. ఆ డ్యాం భద్రత దృష్ట్యా నాలుగు షట్టర్లను తెరచి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నుంచి సెకనకు 1500 ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదల చేయటంతో భవానీ వాగు సమీపంలో నివసిస్తున్నవారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్నవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉలిక్కి పడ్డ షార్!

● బెదిరింపు కాల్‌తో విస్తృత తనిఖీలు
● ఫేక్ కాల్ చేసింది సేలంవాసిగా గుర్తింపు
● తమిళనాడులో నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): 'షార్‌లో తీవ్రవాదులున్నారు. బాంబు పెట్టారు' అంటూ చెన్నై పోలీస్ కంట్రోల్ రూంకు వచ్చిన ఫోను కాల్‌తో షార్ ఉలిక్కిపడింది. అక్కడి పోలీసుల సమాచారంతో బాంబు స్క్వాడ్, పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది షార్‌లో జల్లెడ పట్టారు. రాత్రి వేళల్లో నిశ్శబ్దంగా ఉండే షార్ కేంద్రంలో సోమవారం తెల్లవారు జామున ఓ పక్క పోలీసు జీపుల సైరన్, మరోపక్క శ్రీహరికోట లోపలున్న ఉద్యోగుల కాలనీ, లేబర్ కాలనీ, పలు కీలక విభాగ కార్యాలయాలు, వెలుపల రహదారుల పక్కన భద్రత దళాలతో నిండిపోయింది. పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది దాదాపు 8 గంటల పాటు షార్‌లో అణువణువునా గాలించారు. సముద్ర మార్గంలోనూ తనిఖీలు చేసి నిఘా పెంచారు. ఉద్యోగస్తుల వాహనాలతో పాటు షార్‌కు వెళ్లే కాంట్రాక్టర్లు, ప్రైవేట్ కంపెనీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల వివరాలడిగి లోపలకు పంపించారు. మరోవైపు షార్ చుట్టుపక్కల తీర ప్రాంత గ్రామాలు, సూళ్లూరుపేట పట్టణంలోనూ అలజడి నెలకొంది. చివరకు ఫేక్‌కాల్‌గా నిర్ధారించారు. తమిళనాడు పోలీసులు ఇచ్చిన ఫోను నెంబరు ఆధారంగా ఆ ఫేక్ కాల్ చేసింది సేలంకు చెందిన బాలకృష్ణన్ విజయ్ బాబుగా గుర్తించారు. సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడు తదితరులు సేలం వెళ్లి అక్కడి పోలీసుల సాయంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మానసిక స్థితి సరిగాలేక ఇలా పలుమార్లు.. అక్కడి కార్యాలయాలకూ బెదిరింపు కాల్స్ చేసినట్లు సమాచారం.

నిఘా నీడలో..

ఫేక్ కాల్ అయినప్పటికీ షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన.. రెండో గేటు, చుట్టుపక్కల అడవుల్లో నిఘా పెంచారు. ప్రయోగ వేదిక వద్ద, తీరం వెంబడి భద్రత పెంచారు. లేబర్ కాలనీల్లో నివాసం ఉండే వారు తప్ప వారి బంధువులకూ అనుమతివ్వడం లేదు.





షార్ లేబర్ కాలనీలో నివాసితుల వివరాలు సేకరిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది - షార్‌లో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కార్యాలయం వద్ద బాంబు స్క్వాడ్

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శివ, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.

గంజాయి విక్రయించిన నలుగురి అరెస్టు

అడయార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో గంజాయి విక్రయించిన నలుగురుని నగర పోలీసులు అరెస్టు చేశారు. వేళచ్చేరి ఎంఆర్‌టీఎస్ ప్రాంతంలో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్టు ఆదివారం రాత్రి అడయార్ ఎక్సైజ్ విభాగం పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో హుటాహుటిన అక్కడకు మఫ్టీలో వెళ్ళిన పోలీసులు.. గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు మహిళలతో పాటు మొత్తం నలుగురుని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని స్టేషన్‌కు తీసుకెళ్ళి విచారించగా, హైదరాబాద్‌కు చెందిన గీత (60), సరిత (40), సహాయమేరి (35), వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దాస్ (39)లుగా గుర్తించారు. వీరి నుంచి 25 కేజీల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

● బంగారం చోరీ కేసు...
కేరళలో కారు స్వాధీనం
● ముఠా కోసం గాలింపు

అడయార్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన నగల దుకాణం యజమాని వద్ద కోయంబత్తూరులో 1.25 కేజీల బంగారాన్ని దోచుకున్న కేసులో నగల దుకాణం యజమాని కారును ప్రత్యేక బృందం పోలీసులు కేరళలో స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఐదుగురు ముఠా కోసం గాలిస్తున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూర్‌కు చెందిన జైసన్ జాకబ్ అనే వ్యాపారి బంగారు కడ్డీలను కొనుగోలు చేసి వాటిని నగల తయారీ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చెన్నై వచ్చిన ఆయన కొన్ని దుకాణాలకు బంగారు కడ్డీలను సరఫరా చేసి, రూ.కోటి విలువ చేసే మిగిలిన 1.25 కేజీల బంగారంతో తన సిబ్బందితో కలిసి కేరళకు తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో ఆయన కారు కోవై చేరుకోగా, కొందరు దోపిడీ ముఠా సభ్యులు కారుకు అడ్డంగా ఒక లారీని ఆపి... జాకబ్, అతని సిబ్బందిని కిందకు దించేసి, బంగారం ఉన్న కారును హైజాక్ చేశారు. దీనిపై జాకబ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రత్యేక బృందం పోలీసులు విచారణ జరిపి హైజాక్ చేసిన కారు కేరళ రాష్ట్రంలోని వళక్కల్ అనే ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అదేసమయంలో ఈ కారును హైజాక్ చేసిన ఐదుగురి ముఠా కోసం ప్రత్యేక బృందం పోలీసులు గాలిస్తున్నారు.

ఫ్యాక్టరీలన్నీ తెరిస్తేనే
మామిడి రైతులకు ప్రయోజనం

● ఫ్యాక్టరీల వద్ద నిరసనల పర్వం ● ర్యాంపుల్లోనూ పెరిగిన నిఘా

చిత్తూరు సెంట్రల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తోతాపురి రకం మామిడి కాయలకు ధర రావాలంటే జిల్లాలోని గుజ్జు ఫ్యాక్టరీలన్నీ పనిచేయడమే మార్గంగా కనిపిస్తోంది. సీజన్ ప్రారంభమై పంట చేతికి వచ్చి పక్షం రోజులు గడుస్తున్నా, పరిశ్రమలన్నీ పనిచేయకపోవడం, తెరుచుకున్న పరిశ్రమల యాజమాన్యాలపై మామిడి కొనుగోళ్లకు రైతులు ఒత్తిడి పెంచడం తదితర పరిణామాలతో పరిస్థితులు గందరగోళంగా మారాయి. తోతాపురికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వారం రోజులు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలు కాకుండా పోవడం రైతుల్లో నిరాశను పెంచుతోంది. జిల్లాలో 39 గుజ్జు పరిశ్రమలుండగా, 15 ఫ్యాక్టరీలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. మరో 14 ఫ్యాక్టరీలు అటూఇటుగా పనిచేస్తున్నాయి. 6 ఫ్యాక్టరీలు తెరచుకోలేదు. ఫ్యాక్టరీలన్నీ తెరిపించే క్రమంలో అధికార యంత్రాంగం ఆయా ఫ్యాక్టరీల్లోని సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశాయి. .

సామర్థ్యానికి మించి కొనలేం

ఒక్కో ఫ్యాక్టరీ రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 150 టన్నులు కాగా, 30 ట్రాక్టర్ల మామిడి కాయలు అవసరం . ఇందుకు భిన్నంగా ఒక్కో ఫ్యాక్టరీకి 50 ట్రాక్టర్లకు పైగా మామిడి కాయలను తరలిస్తుండడంతో ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతులకు సమాధానం చెప్పలేకపోతున్నాయి. చిత్తూరు సమీపంలోని ఆర్ఎంఎం ఫ్యాక్టరీ యాజమాన్యం ఈనెల 30వ తేదీ వరకు రైతులకు టోకెన్లు ఇచ్చింది. ఇదే బాటలో బంగారుపాళ్యం సమీపంలోని నలగాంపల్లె సన్‌గోల్డు ఫ్యాక్టరీ యాజమాన్యం టోకెన్లు ఇచ్చింది.ఈ నేపథ్యంలో మామిడి కాయలను తీసుకువచ్చిన రైతులు వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రెండు ఫ్యాక్టరీల ముందు ధర్నాకు దిగారు. స్టాక్ అధికంగా కొనుగోలు చేసినందున రెండు రోజుల పాటు మామిడిని తేవద్దంటూ గంగాధరనెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు సూచించింది.



ఆర్ఎంఎం ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

స్థిరంగా టేబుల్ వెరైటీల ధరలు

ఇటు ఫ్యాక్టరీల్లో, అటు మండీల్లో మామిడి ధరలు ఒకే రకంగా కొనసాగుతున్నాయి. గుజ్జు పరిశ్రమలు తోతాపురి టన్ను రూ.5వేల నుంచి రూ.6 వేల మధ్య కొనుగోలు చేస్తున్నాయి. ఇక చిత్తూరు, బంగారుపాళ్యం మండీలకు రోజువారీ వచ్చే టేబుల్ వెరైటీ మామిడి ధరలు వారం రోజులుగా స్థిరంగా వున్నాయి. బేనీషా రూ.20, బేనీషా (కలర్) రూ.25, కాలేపాడు రూ.25, మల్లిక రూ.30, హిమామ్ పసంద్ రూ.70, మల్గూబా రూ.40, తోతాపురి (లైనింగ్ కలర్) రూ.13 పలుకుతున్నాయి.

ర్యాంపుల వద్ద పెరిగిన నిఘా

జిల్లాలో 39 ర్యాంపులు ఉండగా, మార్కెటింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు 25 ర్యాంపులకు లైసెన్స్‌లు అందజేశారు. వీటిలో మామిడి కొనుగోళ్లు ప్రారంభించడంతో అధికారులు నిఘా పెంచారు. ర్యాంపుల వద్ద నాణ్యమైన కాయలకే తప్ప మిగిలిన వాటికి ధరలు లేకపోవడంతో తాము తెచ్చిన కాయలు అమ్ముడుపోతే చాలనే దృష్టితో గిట్టుబాటు ధర అటూ, ఇటుగా అమ్మేయడానికి రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఆటోలకూ క్యూఆర్ కోడ్

● తిరుపతిలో డిజిటలైజేషన్ నెంబర్ల కేటాయింపు
● దశలవారీగా జిల్లా అంతటా అమలు
● ప్రయాణికుల భద్రతకు పోలీసుల చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొందరు ఆటోవాలాల ఆగడాలకు చెక్‌పెట్టేలా పోలీసులు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మొదటి దశలో తిరుపతిలోని 200 ఆటోలను డిజిటలైజేషన్ చేశారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి ఆధ్వర్యంలో సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఆటోల డిజిటలైజేషన్ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఆటోకు డ్రైవర్ వెనుక సీటులో ట్రాఫిక్ పోలీసులు తయారు చేసిన క్యూఆర్ కోడ్‌తో పాటు అందులో వున్న ఎనిమిది అంశాలతో కూడిన స్టిక్కర్‌ను అతికించారు. ఎవరైనా ఆటో డ్రైవర్లు తమతో దురుసుగా ప్రవర్తించినా, మద్యం తాగి నడిపినా, ఇతర విలువైన వస్తువులు ఆటోలో పోగొట్టుకున్నా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఇబ్బంది పెట్టినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపితే చాలు. వెంటనే ఆ ఆటో వివరాలు, ఎక్కడుందనేది కమాండ్ కంట్రోలు ద్వారా పోలీసులు గుర్తించి చర్యలు తీసుకుంటారు. నేరస్తులు ఆటోలో ప్రయాణించి దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే గుర్తించవచ్చని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఈ క్యూఆర్ కోడ్‌లో ట్రాఫిక్ డీఎస్పీతో పాటు సీఐలు, పోలీసు స్టేషన్ నెంబర్లు పొందుపరిచారు. ఆటో యజమాని పేరు, అడ్రస్, ఫొటో, డ్రైవింగ్ లైసెన్సు నెంబరు, స్టాండు ఏరియా, మొబైల్ నెంబరు, ఆటో నెంబరు, అత్యవసరమైన ఫోన్ నెంబర్లు ఉంటాయి. ఆటోలో ఎక్కిన వెంటనే ప్రయాణికుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మొబైల్‌లో ఉంచుకోవాలి. తద్వారా అందులో పొందుపరచిన ప్రింట్, షేర్ ఆన్ వాట్సాప్, ట్రాక్ లొకేషన్, అత్యవసర కాల్ నెంబర్లు, పోలీసు స్టేషన్ వివరాలు, ఫిర్యాదు చేయాలంటే సమీపంలోని పోలీసు స్టేషన్ ఏది అనే వివరాలు అందులో ఉంటాయి.

ప్రతి ఒక్కరూ కోడ్ ఎన్‌రోల్ చేసుకోవాలి


తిరుపతిలోని అన్ని ఆటోలకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన రాజు విజ్ఞప్తి చేశారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాక అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు భక్తవత్సలం, శ్యాంసుందర్, రామకృష్ణమాచ్చారి, డీటీవో మురళీమోహన్, రైల్వే స్టేషన్ ఆటో స్టాండ్ల యూనియన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కర నాయక్, సుబ్బారెడ్డి, ఎస్ఐలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతిలోని 20వేలకుపైగా ఉన్న ఆటోలన్నీ తప్పనిసరిగా డిజిటలైజేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుల్లెట్‌రమణ, కృష్ణయాదవ్, మధు, ప్రమోద్, రామచంద్ర, ఆటో అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా, ఆటో డ్రైవర్లు, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగన్ భక్తుల మహానాడు ప్రాంతంలో
ఆకట్టుకుంటున్న 'ఆరుప్పడై వీడుగళ్'

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మదురైలో హిందూ మున్నని, ఆర్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మురుగన్ భక్తుల మహానాడు ప్రాంతంలో నిర్మించిన ఆరు నమూనా ఆలయాల సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మదురై రింగ్ రోడ్డులో అమ్మా థిడల్‌లో ఈ నెల 22 మధ్యాహ్నం నుండి రాత్రి 9 గంటల వరకు ఈ మహానాడు జరుగనుంది. ఈ మహానాడులో సుమారు ఐదు లక్షలమంది పాల్గొంటారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు మహానాడు సందర్భంగా తిరుప్పరంకుండ్రం, పళని, తిరుచెందూరు, తిరుత్తణి, స్వామిమలై, పళముదిర్‌చోలై మురుగన్ ఆలయాల నమూనా సెట్టింగ్‌లు నిర్మించారు. ప్రతిసెట్టింగ్‌లోను గర్భాలయం గదిలో ఆయా ఆలయాల మూలవిరాట్టును తలపించే ప్రతిమలను పెట్టారు. ఆరుప్పడైవీడుగళ్‌ను దర్శించేందుకు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఆరుప్పడైవీడుగళ్ ప్రదర్శనను పుదుచ్చేరి హోం మంత్రి నమశ్శివాయం, హిందూ మున్నని రాష్ట్ర అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రమణియం ప్రారంభించారు. ఆ సందర్భంగా మూలవిరాట్టు ప్రతిమల వద్ద వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత భక్తులంతా ఈ ఆలయాలను తిలకించారు. ఈ నెల 22 వరకు ఈ నమూనా ఆలయాలను భక్తులు దర్శించేందుకు అనుమతిస్తామని మహానాడు నిర్వాహకులు తెలిపారు.



మహానాడు ప్రాంతం వద్ద నిర్మించిన నమూనా ఆలయాల సెట్టింగ్‌లు



నమూనా ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ప్రతిమకు పూజ చేస్తున్న పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయం, హిందూమున్నని రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణియం తదితరులు

నిర్మాణ పనుల్లో
భద్రతా ప్రమాణాలు పాటించండి

● సౌత్ కోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథూర్

తిరుపతి(సెంట్రల్), జూన్16 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టు పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలని సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరు సందీప్ మాథూర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఎయిర్ కాన్‌కోర్సునిర్మాణాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయాలు, ప్రయాణికులకు కలిగే అసౌకర్యాల గురించి తెలుసుకున్నారు. నిర్మాణాల సమయంలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాల గురించి అడిగారు. ఇక, రైల్వే స్టేషన్ అభివృద్ధి, తిరుపతి-చెన్నై బైపాస్ మార్గం పనులు, రేణిగుంటలో రూ.25 కోట్లతో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. పూడి-ఏర్పేడు బైపాస్ లైన్ ప్రాజెక్టు ఏదశలో ఉందని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి- నడికుడి రైలు మార్గం పనులు ఏ దశలో.. ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. ఇలా రెండున్నర గంటల పాటు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే నిర్మాణాల విభాగం సీఈ సూర్యనారాయణ, ఏడీఆర్ఎం సుధాకర్, వివిధ విభాగాల అధికారులు వామనమూర్తి, డాక్టర్ శ్రావణకుమార్, మణికుమార్, సాయివిజయ్ కుమార్, మణికంఠ, సుదర్శన్, రమేష్‌కుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనరు రాజగోపాల్ రెడ్డి, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, మాధవరావు, రాంబాబు, ఎం.సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ ప్లానింగ్‌కు కొత్త పెన్షన్ ఫండ్



కొత్త పెన్షన్ ఫండ్ ఆవిష్కరణ సభలో నిర్వాహకులు

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బీమా సంస్థ స్టార్ యూనియన్ (ఎస్‌యూడీ) డై-చీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పాలసీబజార్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఈ రెండు సంస్థలూ కలిసి ఎస్‌యూడీ లైఫ్ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ పెన్షన్ ఫండ్ ఆఫర్ ప్రకటించాయి. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌యూడీ డై-చి. లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ అభయ్ తివారీ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ ప్లానింగ్‌కు ఈ పెన్షన్ ఫండ్ ఆఫర్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పాలసీ బజార్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వివేక్ జైన్ మాట్లాడుతూ ప్రశాంతమైన పదవీ విరమణ జీవితానికి రెండు సంస్థలు కలిసి ఇచ్చే పెన్షన్ ఫండ్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు.